

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024-25లో మైనింగ్ శాఖ లక్ష్యం, వసూళ్లు ఇలా..

జిల్లా	క్వారీలు	లక్ష్యం	వసూలు చేసింది
వరంగల్	51	రూ.22.72కోట్లు	రూ.11.49కోట్లు
హనుమకొండ	128	రూ.61.72కోట్లు	రూ.37.08కోట్లు
మహబూబాబాద్	63	రూ.36.81కోట్లు	రూ.33.15కోట్లు
జనగామ	39	రూ.12.15కోట్లు	రూ.6.55కోట్లు
ములుగు	53	రూ.51.37కోట్లు	రూ.49.18కోట్లు
భూపాలపల్లి	01	రూ.5.27కోట్లు	రూ.4.98కోట్లు
మొత్తం	335	రూ.190.02కోట్లు	రూ.142.43కోట్లు



మైనింగ్.. అక్రమాల్లో రింగ్!

కొందరు అధికారులు, అక్రమార్కుల కుమ్మక్కు

- రాయల్టీ, సీనరేజీ ఎగవేతతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 335కి పైగా గ్రానైట్, కంకర క్వారీలు
- 2024-25లో మైనింగ్‌శాఖకు రూ.190.02కోట్ల ఆదాయం లక్ష్యం
- గడువు ముగిసినా ఇంకా 25శాతం పన్ను వసూళ్లకు బ్రేక్
- నాన్‌వర్కింగ్ పేరుతో పదుల సంఖ్యలో క్వారీ పన్నుల ఎగవేత
- అక్రమార్కులకు అండగా కొందరు మైనింగ్ అధికారులు
- కంకర క్వారీల విషయంలోనూ ఇదే పరిస్థితి

మైనింగ్ దందా.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఈ శాఖలోని కొందరు అధికారులు అక్రమార్కులతో 'రింగ్' అవుతుండటంతో.. గ్రానైట్, కంకర, మట్టి తదితర ఖనిజ సంపదను దర్జాగా కొల్లకొడుతున్నారు ఆ అక్రమార్కులు. ఒక చోట లీజుకు తీసుకుని.. సమీపంలోనే మరో చోట తవ్వితీసి.. ఆ ఖనిజానికి రాయల్టీ, సీనరేజ్‌ని ఎగవేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ అక్రమ దందాతో పాటు సక్రమంగా చెల్లించాల్సిన పన్నులను కూడా ఎగవేస్తూ సర్కారు ఖజానాకి భారీగా గండి కొడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖకు రూ.190.02కోట్ల ఆదాయం లక్ష్యం కాగా, కేవలం 75శాతం వరకే వసూళ్లు చేశారు. ఈ క్రమంలో పన్నువసూళ్లలో కొందరు అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని, ఇద్దరూ కుమ్మక్కై సర్కారు ఆదాయానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారనే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అక్రమ మైనింగ్‌తో కొందరు వ్యాపారులు సర్కారు ఖజానాకు గండికొడుతున్నారు. వారితో ఆశాఖలోని కొందరు అధికారులు మిలఖాత్ అవుతున్నారని, ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్, రాయల్టీల సొమ్ముకు భారీగానే గండిపడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ లీజుదారులు మైనర్ మినరల్ అయితే సీనరేజ్, మేజర్ మినరల్ అయితే రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి కొంత మొత్తం పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 335కు పైగా గ్రానైట్, కంకర క్వారీలకు మైనింగ్‌శాఖ నుంచి అనుమతులున్నాయి. వీటితో పాటు 25కు పైగా ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. అయితే అనుమతి ఒక చోటయితే.. చుట్టు పక్కల ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మైనింగ్ చేస్తూ కోట్లు కొల్లకొడుతున్నారు. ఇటీవల ఐనవోలు మండలం వనమాల కానిపర్తి గ్రామ సమీపంలో 42ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే ఈ 42 ఎకరాల్లో కాకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకొని 93ఎకరాల్లో అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మిగతా 43ఎకరాల్లో తవ్వే గ్రానైట్‌కు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఎగవేతకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే మండలంలో మరో గ్రామంలో 4.20ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాలు చేపట్టారు. తొలుత అది ప్రభుత్వ భూమిగా ఉన్నప్పటికి.. ఆ తరువాత కాగితాలు మార్చేసి ప్రైవేటు భూమిగా మార్చి ప్రభుత్వానికి రూ.కోట్లలో పన్నులను ఎగవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోనే ఇలాంటి అక్రమ దందా జోరుగా సాగుతోంది. పంథని, రాంపూర్, ఎల్కతుర్తి, తదితర ప్రాంతాల్లో గ్రానైట్ కటింగ్ మిషన్లను ఏర్పాటు చేసి, అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కోట్లాది రుపాయల గ్రానైట్ సంపద దారి తప్పుతోంది. అయితే ఈ దందాల వెనుక మైనింగ్ శాఖలోని కొందరు అధికారుల సహకారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి కోట్లాది రుపాయల గ్రానైట్‌ను అక్రమంగా అమ్ముతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ దందా మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇక కంకర క్వారీల్లోనూ ఇదే అక్రమ పద్ధతుల్లో సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల్లో ఇసుక

మిగతా 7వ పేజీలో...

ఏ గ్రానైట్‌కు ఎంతంటే..

కలర్ గ్రానైట్ ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.3,948, అలాగే బ్లాక్ గ్రానైట్ అయితే ఒక క్యూబిక్ మీట ర్‌కు రూ.4,763 రాయల్టీ చెల్లించా ల్సి ఉంది. ఈ లెక్కన ఒక బ్లాక్ సుమారు 8నుంచి 10క్యూబిక్ మీటర్లు ఉంటుంది. కలర్ గ్రానైట్ అయితే రూ.31,584 నుంచి రూ.39,480 వరకు, బ్లాక్ గ్రానైట్ గ్రానెట్ అయితే రూ.38,104 నుంచి రూ.47,630 వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ రోజు ఒక్కో క్వారీలో 1నుంచి 5వరకు బ్లాక్‌లను తీస్తారు. ఈ లెక్కనే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా లక్షలాది రుపాయల గ్రానెట్ దారిమళ్లుతుందనే వాదన వినిపిస్తుంది.



రజతోత్సవ సభను సక్సెస్ చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న మాలోత్ కవిత

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత

మహబూబాబాద్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లాలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డోర్నకల్ నియోజకవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గం నుంచి 10వేల మంది కార్యకర్తలు వరంగల్ సభకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ మండలం నుంచి 2 వేల మంది చొప్పున సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీమంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, జిల్లా యువజన నాయకులు డీఎస్ రవిచంద్ర, నూకల వెంకటేశ్వర్ రెడ్డి, బిక్షంరెడ్డి, దేవేందర్, విద్యాసాగర్, వేణు పాల్గొన్నారు.

మానుకోట నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు : శివప్రసాద్



ఆర్టీసీ మేనేజర్ శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈ నెల 6న జరిగే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట డిపో నుంచి ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 5 ప్రత్యేక బస్సులు నడపనున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించి, స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- అవినీతి రహిత పాలనే ధ్యేయం
- బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి

8

మరుగుదొడ్ల బిల్లులు వాపస్

- 29 జీపీల నుంచి రూ.31 లక్షలు వెనక్కి
- గ్రామాల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు
- బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

6

అతలాకుతలం

జిల్లాలో అకాల వర్షానికి రైతన్న విలవిల

- బయ్యారంలో తడిసిన 2 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు
- కొత్తగూడలోనూ 150 ఎకరాల్లో పంటనష్టం
- గార్ల మండలంలో నేలవాలిన వరి
- మహబూబాబాద్ మార్కెట్‌లో తడిసిన మిర్చి బస్తాలు



సీరోలు మండలం కాంపల్లిలో ధాన్యం రాసులపై నిలిచిన వాననీటిని తొలగిస్తున్న రైతు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం రాత్రి పలు మండలాల్లో అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీవాన పలు మండలాల్లో దంచి కొట్టింది. బయ్యారం మండలంలో భారీ వర్షం కురియగా, మహబూబాబాద్, గార్లతో పాటు ఇతర మండలాల్లో ఓమోస్తారు వర్షం కురిసింది. బయ్యారం మండలంలో 2 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు వరదనీటిలో మునిగి నష్టం వాటిల్లగా, గార్ల మండలంలోని పలు గ్రామాల్లో బలమైన గాలులకు వరిచేలు నేలవాలగా, కోసిన వరి మొదళ్లు నీటిలో మునిగిపోయాయి. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి మిర్చి బస్తాలు తడిసిపోయి నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా వర్షం కురియడంతో రైతులు పరేషాన్‌కు గురయ్యారు. కొత్తగూడలో వర్షంతో పాటు వడగండ్ల వాన కురియడంతో 150 ఎకరాల్లో మొక్కజొన్న చేలు నేలవాలి కంకులు విరిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

బయ్యారం మండలంలో భారీ వర్షం కురిసింది. వెంకటాపురం పంచాయతీ పరిధిలో సంగ్యతండాలో ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. సుమారు 20మంది రైతులు 50 ఎకరాల్లో పండించిన 2 వేల క్వింటాళ్ల మొక్కజొన్న ఆరబెట్టిన చోట వర్షపునీరు నిలిచికుప్పలు తడిసిపోయి కుప్పలు నీట మునిగాయి. రూ.లక్షల్లో భారీ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గార్లలో మండలంలోని గార్ల, సీతంపేట, మర్రితండా, రాంపురం గ్రామాల్లో పాకాల పరివాహక ప్రాంతాల్లోనూ వరి పొలాలు నేలవాలాయి. కోతలు కోసిన రైతులు పొలాల్లోనే వరి మెదళ్లను ఆరబెట్టుకోగా, అవి పూర్తిగా తడిసిపోయి భారీ నష్టం జరిగింది. మిర్చిని తెంపి కల్లాల్లో ఆరబెట్టుకోగా.. అకాల వర్షం కురియడంతో రైతులు ముందు జాగ్రత్తపడి టార్పాలిన్‌లు కప్పుకుని కాపాడుకున్నారు. కుప్పల కింది భాగంలో వర్షపునీరు వెళ్లడంతో కొంత మేర కుప్పలు తడిసిపోయాయి. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కురిసిన మోస్తారు వర్షానికి యార్డులో అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు కొంత మేర తడిసిపోయాయి. యార్డులో షెడ్లలో చివరి వైపున వేసిన మిర్చి బస్తాలు, ఫ్లైఓవర్‌కింద పెట్టుకున్న మిర్చి బస్తాలు వర్షం తాకిడికి తడిసిపోవడంతో రైతులు నష్టపోయారు.

శుక్రవారం ఉదయం తడిసిన బస్తాలను యార్డులో ఆరబెట్టుకోవడం కన్పించింది. కొత్తగూడలో వడగండ్ల వాన కురిసింది. బలమైన గాలులకు 150 ఎకరాల్లో మొక్కజొన్న చేలు నేలవాలాయి. కంకులు విరిగిపోయాయి. మండల వ్యవసాయాధికారి ఉదయ్ క్షేత్రసందర్శన చేసి, నష్టంపై ప్రాథమిక అంచనా వేస్తున్నారు. చిన్నగూడూరు, దంతాలపల్లి, డోర్నకల్, సిరోలు మండలంలోని కాంపల్లిలో ధాన్యం కొనుగోలు

మిగతా 8వ పేజీలో...



సంగ్యాతండాలో నీటమునిగిన మొక్కజొన్న కుప్పలు



కొత్తగూడలో నేలవాలిన మొక్కజొన్న పంట, విరిగిన కంకులతో రైతులు

జిల్లాలో 354.2 మిల్లీమీటర్ల వర్షపాతం..

మహబూబాబాద్ జిల్లాలో గురువారం రాత్రి బయ్యారంలో 112.4 మిల్లీమీటర్ల వర్షంపడగా కొత్తగూడలో 10.4, గంగారంలో 5.6, గార్లలో 19.8, డోర్నకల్‌లో 3.0, కురవిలో 20.2, మహబూబాబాద్‌లో 46.2, గూడూరులో 6.8, కేసముద్రంలో 9.2, నెల్లికుదురులో 1.0, నర్సింహులపేటలో 34.0, చిన్నగూడూరులో 14.2, మరిపెడలో 48.4, దంతాలపల్లిలో 2.0, తొర్రూరులో 9.6, పెద్దవంగరలో 11.4, వెరసి 354.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 22.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మహబూబాబాద్ మార్కెట్‌లో తడిసిన మిర్చి బస్తాలను ఆరబెట్టుకున్న రైతులు



గార్ల మండలం పెద్దచెరువు కింద నేలవాలిన వరిపంట

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పదవీవిరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగులు పట్టాభి లక్ష్మయ్య, గుడెల్లి బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్, 2022 నుంచి రావాల్సిన లీవ్ ఎన్కాష్మెంట్, సీపీఎస్ బకాయిలు చెల్లించాలన్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు అదే రోజు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు పెన్షన్ సైకర్యం లేనందున తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, ఫ్యామిలీ పెన్షన్ స్కీం ఇబ్బందులు తొలగించి అయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సదరు డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజరు శివప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తయ్య, సుధాకర్, రంజాన్, హరికుమార్, బీఎన్ రావు, ఉమామహేశ్వర్, వీరాచారి, రాజమల్లు, ఫుల్లారెడ్డి, కోటయ్య, బ్రహ్మయ్య, జగన్, క్రిష్ణయ్య, వెంకన్న, 100 మంది పాల్గొన్నారు.



మానుకోట ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కాంగ్రెస్‌ది కమీషన్ పాలన

- సీఎంకు పాలనపై పట్టులేదు
- తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్సే పెద్దదిక్కు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కమీషన్ పాలన సాగిస్తోందని, ఏబిల్లు మంజూరు కావాలన్నా మంత్రులకు 12శాతం ముడుపులు అందాల్సిందేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈనెల 27న ఎల్కతుర్తి వద్ద జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం శుక్రవారం ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారని, ఇక ఎంత కష్టపడ్డా ట్రాక్‌లోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. సుదీర్ఘపోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో దేశంలోనే అగ్రభాగాన నిలిపిందన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మళ్లీ వెనుకబాటుకు గురిచేసిందని తెలిపారు. నమ్మి ఓటేసిన అన్నివర్గాల ప్రజలు గోసపడుతున్నారన్నారు. ఎప్పుడైనా తెలంగాణకు బీఆర్ఎస్సే పెద్దదిక్కని తెలిపారు. గత పాలనలోనే తెలంగాణ దివాళా తీసిందని అసత్యాలు చెబుతున్న రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో 420హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ములుగులో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ప్రగతి భవన్‌ను నక్సలైట్లు బాంబులుపెట్టి పేల్చివేయాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి నేడు అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారని, కేంద్రం ఆపరేషన్ ఖగార్‌ను అమలుచేస్తుంటే అదే మాట ఇప్పుడు మాట్లాడగలవా..? అని నిలదీశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయకుంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయలేమని కడియం శ్రీహరి మాట్లాడటం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. డిప్యూటీ సీఎంగా పనిచేసిన ఆయన కాంగ్రెస్‌లో అస్తిత్వం కోసం సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై మంత్రి సీతక్క కేసులు పెట్టిస్తున్నారని, ఇది ఆమె సహజ నైజానికి విరుద్ధమని సుదర్శన్‌రెడ్డి అన్నారు. 27న ఎల్కతుర్తిలో జరిగే సభకు జిల్లా నుంచి 17వేల మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బిల్లులు వాపస్

- 29 జీపీల నుంచి రూ.31 లక్షలు వెనక్కి
- గ్రామాల్లో అసంపూర్తిగానే మరుగుదొడ్లు
- బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

తొర్రూరు రూరల్(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కింద ప్రతీ గ్రామంలో నిర్మించుకున్న లబ్ధిదారులకు మరుగుదొడ్ల బిల్లులు అధికారుల అలసత్వంతో చెల్లించలేదు. దీంతో తొర్రూరు మండలంలోని 29 గ్రామ పంచాయతీల నుంచి రూ.31లక్షల నిధులను ప్రభుత్వం రిటర్న్ తీసుకుంటుంది. 2019 సంవత్సరంలో స్వచ్ఛభారత్ కింద ప్రతీ గ్రామాన్ని ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది. ప్రతీ లబ్ధిదారుడికి రూ.12వేల చొప్పున నిధులు చెల్లించేందుకు గ్రామీణ నీటి పారిశుధ్య కమిటీ(వీడబ్ల్యూఎస్సీ) ఖాతాలు తెరిచింది. మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగానికి ప్రోత్సాహక మొత్తాన్ని ఎలక్ట్రానిక్ ఫండ్ టాన్స్‌ఫర్ మోడ్ ద్వారా వీడబ్ల్యూఎస్సీ ఖాతాకు నిధులు విడుదలయ్యాయి. జిల్లాలోని అన్ని జీపీల్లో ఖర్చు చేయకుండా నిల్వలు అందుబాటులో ఉండడంతో వడ్డీతో సహా అందుబాటులో ఉన్న నిలువలు మొత్తం తక్షణమే ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి బదిలీ చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని 482 జీపీల్లో ఉన్న రూ.3కోట్ల 84లక్షల నిధులు రిటర్న్ పంపిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

అసంపూర్తిగానే మరుగుదొడ్లు

జిల్లాలో అన్నిగ్రామాల్లో అధికంగా మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే నిర్మాణాలు ఉన్నాయి. ప్రభుత్వం ఒకేసారి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనడంతో అధికారులు కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేశారు. మరికొన్ని గ్రామాల్లో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల బిల్లుల కోసం



సోమారం గ్రామంలో రింగ్‌లు, డోరు లేకుండా అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి (ఫైల్)

లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందించే బిల్లుల కోసం ప్రతీ రోజు గ్రామ పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదు. అంతేకాకుండా హరిపిరాల జీపీ పరిధిలో 37 మరుగుదొడ్లు ఎస్బీఎం నుంచి మంజూరయ్యాయి. ప్రభుత్వం నుంచి రూ.12,500 అందజేస్తామని అధికారులు ప్రోత్సహించడంతో లబ్ధిదారులు నిర్మించుకోవడానికిముందుకువచ్చారు. నిర్మాణాలు ప్రారంభించే సమయంలో ఎస్బీఎం నుంచి వచ్చే నిధులు జమ చేసుకోవచ్చు అనే అధికారుల ఆదేశాలతో గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.6,500 చొప్పున రూ.2.40లక్షల విలువైన మెటీరియల్ అందజేశారు. కాగా, సోమారం గ్రామంలో 25 మరుగు దొడ్లకు కాంట్రాక్టర్ గోడల నిర్మాణం, డోరు ఏర్పాటుచేసి, లబ్ధిదారుల నుంచి అదనంగా రూ.2వేలు ఇస్తే రింగ్స్, కనెక్షన్ ఇస్తానని తీసుకెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2021 సంవత్సరంలో చెర్లపాలెం గ్రామంలో సుమారు రూ.10లక్షల మరుగుదొడ్ల బిల్లులు స్వాహా చేసినట్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడం కలకలం రేపింది. దీంతో డీఆర్డీఏ, ఎస్బీఎం అధికారులు నామమాత్రంగా విచారణ చేపట్టి అప్పటి ఎంపీడీవోకు మెమో జారీ చేసి, కాంట్రాక్టర్‌పై కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయించకుండా లబ్ధిదారులకు నిధులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లకు రూ.12వేలు చొప్పున చెల్లించాల్సి ఉండగా సోమారం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రూ.2,31,178, చెర్లపాలెం గ్రామంలో రూ.5,15,663, చీకటాయపాలెంలో రూ.2,41,000, అమ్మాపురంలో రూ.6,22,349, వెల్లికట్టె రూ.4,98,739, వెంకటాపురంలో రూ.1,84,033, నాంచారిమడూరు రూ.1,75,773, కంఠాయపాలెం రూ.1,42,787, మాటేడు రూ.1,26,217, చింతలపల్లి రూ.49,108, జమస్థాన్‌పురం రూ.41,318, హరిపిరాల రూ.33,500, పోలేపల్లి రూ.33,243, గుర్తూర్ రూ.22,073, కర్కాల రూ.8,111, ఖానాపురం రూ.1177, అమర్‌సింగ్‌తండా రూ.1,19,560, కొమ్మనపల్లి తండా రూ.1,19,115, బోజ్యాతండా రూ.1,35,567, టీక్యాతండా రూ.2,17,861 చొప్పున 29 గ్రామాల నుంచి రూ.31 లక్షల వరకు మరుగుదొడ్ల డబ్బులను ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ ఆదేశాలతో పంపించాం

పూర్ణచందర్, ఎంపీడీవో, తొర్రూరు



గ్రామీణ నీటి పారిశుధ్య కమిటీ(వీడబ్ల్యూఎస్సీ) ఖాతాల్లో మరుగుదొడ్లకు సంబంధించి నిలువ ఉన్న డబ్బులను తిరిగి పంపించాలనే ప్రభుత్వ ఆదేశాలతో రిటర్న్ పంపించాం. గ్రామాల్లో పూర్తిగా మరుగుదొడ్లు నిర్మాణం చేసిన వారికి చెల్లించగా మిగిలిన డబ్బులను మాత్రమే పంపిస్తున్నాం.

గడ్డి మందు తాగిన మహిళ మృతి

డోర్నకల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో మనస్తాపం చెందిన మహిళ ఈనెల 2న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోదుగుగడ్డతండాకు చెందిన దారావత్ పార్వతి(28) తన ఇంటి ఎదురుగా ఉండే దారావత్ చంటి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతి ఈనెల 2న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త అనిల్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చికిత్స సమయంలో పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం పార్వతి మృతదేహాన్ని తండాకు తరలించగా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సికిల్ సెల్ అనీమియాను పారదోలాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సికిల్ సెల్ అనీమియాను సమాజం నుంచి పారద్రోలేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ఇప్పటి వరకు 1,56,925 మంది గిరిజనులకు స్క్రీనింగ్ నిర్వహించి అందులో 12 మందిని గుర్తించినట్లు వైద్యులు తెలిపారని, ఈ వ్యాధిని ఆదిలోనే కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సికిల్ సెల్ అనీమియా వ్యాధి నివారణకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌వో రవిరాథోడ్, ఆర్డీవో కృష్ణవేణి, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డాక్టర్ మౌనిక, కొప్పు ప్రసాద్, వడ్డెబోయిన శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్‌నాయక్

సన్నబియ్యం రవాణాను వేగిరం చేయాలి

- కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



వీసీలో పాల్గొన్న ములుగు కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపులకు సన్నబియ్యం రవాణాను వేగవంతం చేయడంతో పాటు నూతన రేషన్‌కార్డు దరఖాస్తుల స్క్రూటినీ త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన సీఎస్ శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి సన్నబియ్యం రవాణాపై కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.40కిపైగా కిలో బియ్యానికి వెచ్చించి ప్రజలకు ఉచితంగా దొడ్డుబియ్యం సరఫరా చేశామని, పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ 70నుంచి 80శాతం వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదని, రీసైక్లింగ్ ద్వారా కోళ్లఫారాలు, ఇతర అవసరాలకు తరలివెళ్లేదని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా దొడ్డుబియ్యం తినడం ఆపేశారని, దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్నబియ్యం రవాణాపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ వల్ల రేషన్‌షాపుల వద్ద ఒకేసారి డిమాండ్ పెరిగిపోతున్నందున రేషన్ షాపుల వద్ద అవసరమైన మేర బియ్యం అందుబాటులో ఉంచాలన్నారు. నూతన రేషన్‌కార్డుల దరఖాస్తుల స్క్రూటినీ వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ ములుగు జిల్లాలో మొత్తం 222 రేషన్ దుకాణాలు ఉండగా, 91,563 రేషన్‌కార్డులు ఉన్నాయని, 2,57,841 మంది లబ్ధిదారులు లబ్ధి పొందుతున్నారని అన్నారు. వారికి మొత్తం 1702.096 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్ జీ, జిల్లా పౌర సరఫరాల అధికారి షాఫైజల్ హుస్సేని, జిల్లా మేనేజర్ రాంపతి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం పరిశీలించిన ఆర్‌అండ్‌బీ, విద్యుత్ అధికారులు

కేసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ నుంచి కోరుకొండపల్లి క్రాస్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు శుక్రవారం రోడ్లు భవనాలశాఖ ఎస్ఈ నరేందర్‌రావు, ఈఈ భీమ్లా, ఏఈఈ ప్రశాంత్‌నాయక్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. రోడ్డు వెడల్పు కోసం ముందస్తుగా అడ్డుగా ఉన్న చెట్లను నరికివేయడం, విద్యుత్ స్తంభాలను జరపడం, కల్వర్టుల వెడల్పు కోసం అంచనాలు రూపొందించేందుకు అధికారులు పరిశీలించినట్లు మునిసిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. చెట్ల తొలగింపు కోసం అటవీశాఖ అనుమతులు తీసుకొని, చెట్ల నరికివేత వెంటనే ప్రారంభించనున్నట్లు వివరించారు. రోడ్డు విస్తరణ పనులు సజావుగా నిర్వహించేందుకు ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖాధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

దుకాణాలు, ఇళ్ల యజమానుల్లో ఆందోళన..

అంబేద్కర్ సెంటర్ నుంచి కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వరకు 80 ఫీట్ల రోడ్డుగా నిర్మాణం చేయనున్నట్లు సర్వేకు వచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు మౌఖికంగా చెబుతుండడంతో దుకాణాదారులు, ఇళ్ల యజమానులు తమ ఉపాధి, ఇళ్లు కోల్పోతామని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కొద్దినెలల క్రితం రోడ్డును 80 ఫీట్ల వరకు నిర్మిస్తున్నామని, దుకాణాలకు, ఇళ్లకు మార్కింగ్ వేసిన విషయం విధితమే. అదే రోజున పలువురు ఇళ్లు, దుకాణాదారులు రాస్తారోకో నిర్వహించారు. ఆ తర్వాత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సైతం ఇచ్చారు. అయినప్పటికీ రోడ్డు వెడల్పు తగ్గించకుండా అలాగే నిర్మిస్తుండడంతో మళ్లీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 80 ఫీట్లతో నిర్మిస్తే వందలాది మంది ఉపాధి, ఇళ్లు కోల్పోయి వీధిన పడుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేసముద్రం మార్కెట్ రోడ్‌లో విస్తరణ పనుల కోసం పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

వ్యాధి నిరోధక టీకాలు పూర్తిచేయాలి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో రవిరాథోడ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వ్యాధి నిరోధక టీకాలపై మైక్రో యాక్షన్‌ప్లాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పీహెచ్‌సీ, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన అవసరమన్నారు. రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమంలో భాగంగా పుట్టిన దగ్గర నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలందరికి, అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు ఈ నెల 7వ తేదీ నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మురారి, లక్ష్మీనారాయణ, కుమార్, ప్రసాద్, వడ్డెబోయిన శ్రీనివాస్, శారద, గీత పాల్గొన్నారు.



మోదీ చేష్టలతోనే రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్



తాళ్లాకల్ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పీఎం మోదీ చేష్టలతోనే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ కోసం ఊరూరా ప్రజలను చైతన్యం చేయడానికి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మరిపెడ మండలం తాళ్లాకల్‌లో ఆ పార్టీ కార్యకర్తలు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేసి ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీకి పేదల కంటే సంపన్నులే ముఖ్యమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అభివృద్ధితో పాటు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, ఎన్.అభినవ్‌రెడ్డి, కొంపెల్లిశ్రీనివాస్‌రెడ్డి, చాపల యాదగిరిరెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, ఎస్కే.అఫ్జల్, రాంలాల్, ఐలిమల్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఓ రేషన్ షాపు ప్రారంభించి, లాభోక్తులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి..

- పుష్కరాలకు ఇబ్బంది
- ఎస్సారెస్పీ నీటి విడుదలకు కసరత్తు

మహదేవపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో వచ్చే నెల 15 నుంచి సరస్వతి పుష్కరాలు జరుగనున్నాయి. లక్షలాది మంది భక్తులు ఈ పుష్కరాలకు రానున్నారు. అసలే ఎండాకాలం కావడంతో గోదావరిలో నీటి ప్రవాహం రోజురోజుకు తగ్గిపోతోంది. వారం రోజుల నుంచి ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రాణహిత నది క్రమక్రమేణా తగ్గుతుండడంతో పుష్కరాలకు నీళ్లు ఉండేనా.. అనే ఆలోచన పలువురిలో మెదులుతోంది. తెలంగాణలోనే కాళేశ్వరంలో పుష్కరాలు ఉండడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. గోదావరిలో నీళ్లు తక్కువ ఉంటే భక్తులు ఇబ్బందులు కలుగుతాయని ఇరిగేషన్ అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేస్తారా.. లేకుంటే ఆనకట్ట వేస్తారా.. అనేది ఇరిగేషన్ అధికారులు ఆలోచనలో పడ్డారు. ఏదిఏమైనా సరస్వతి పుష్కరాలు సమీపిస్తుండడంతో ఇరిగేషన్ అధికారులు ఏదో ఒక ప్రయత్నాలు చేసి కాళేశ్వరం వద్ద నీరు ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.



నీటి ప్రవాహం తగ్గిన గోదావరి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2181	1521
పల్లికాయ (సూక)	6100	5200
పల్లికాయ (పచ్చిది)	4575	4000
కందులు	6852	3022
పెసళ్లు	7450	3022
పత్తి	7400	5300
పసుపు (కాడి)	13399	10534
పసుపు (గోల)	13169	9700
తేజ మిర్చి	12900	9500
డిడి	-	-
వండర్‌హాట్	14000	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11200	9000
దేశీ	26500	18000
సింగిల్‌పట్టి	23000	18500
దీపిక	13000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం



కోనాయిమాకుల సమీపంలోని పంచముఖ ఆంజనేయ క్షేత్రం



ఆలయంలో కొలువైన పంచముఖ అభయాంజనేయస్వామి

మహిమాన్వితుడు పంచముఖ ఆంజనేయుడు

- తొమ్మిదడుగుల ఎత్తు, ఐదు ముఖాలు, పది చేతులతో భక్తులకు అభయం
- దక్షిణాదిలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న హనుమాన్ క్షేత్రం
- భక్తులు, మాలధారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

గీసుగొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదడుగుల ఎత్తు, ఐదు ముఖాలు, పది చేతులతో.. మహిమాన్వితుడిగా భక్తకోటికి అభయమిస్తున్నాడు గీసుగొండ మండలం కోనాయిమాకుల సమీపంలో వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి. భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతున్న ఈ ఆలయంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తే సర్వదోషాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. నల్లరాతి ఏకశిలతో చేసిన ఈ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని 2002లో ప్రతిష్ఠించారు. హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని మలిచిన ప్రముఖ శిల్పి గణపతి స్థపతి ఏడాది పాటు తన శిష్య బృందంతో శ్రమించి విగ్రహాన్ని తయారు చేశారు. ఈ ఆలయాన్ని మూడు సంవత్సరాల పాటు సీతా లక్ష్మణ్‌సా పర్యవేక్షణలో నిర్మించారు. ఇక్కడి స్వామి వారికి హయగ్రీవ, వరాహ, లక్ష్మినరసింహ, గరుత్మంత, కపిల ముఖాలు ఉండి దైవత్వం ఉట్టిపడేలా ఉంటుంది. పంచముఖ స్వామికి పది చేతులు ఉండగా ఎడమ వైపు ఉండే ఐదు చేతుల్లో సంజీవని పర్వతం, డాలు, కపాలదండం, ముష్టితాముదావృక్షం, రామాయణ పుస్తకాలు ఉండగా కుడి వైపు ఉండే ఐదు చేతుల్లో సర్పం, ఖడ్గం, గద, నాగలి, మరచెంబు ఆయుధాలు ఉండి దేదీప్యమానమై వెలుగొందుతూ అభయాలిచ్చే అభయాంజనేయుడిగా భక్తుల నుంచి మంగళహారతులు అందుకుంటున్నాడు. మహిరావణుని సంహరించేందుకు ఆంజనేయస్వామి పంచముఖ అవతారం ఎత్తినట్లు పురాణ కథల్లో ప్రచారంలో ఉంది. స్వామివారి పంచముఖాలు పంచ భూతాలకు ప్రతీకలని వేద పండితులు చెపుతారు. ఈ హనుమాన్ క్షేత్రం దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద పంచముఖ విగ్రహంగా పేరుగాంచింది. మొదటి పెద్ద పంచముఖా ఆంజనేయస్వామి ఆలయం తమిళనాడులోని సేలంలో ఉంది. అయితే ఇక్కడి సువిశాల స్థలంలో ఉన్న ఈ ఆలయం భక్తులకు మానసికోల్లాసాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని కలిగిస్తుండగా.. ఇక్కడ సీతారామలక్ష్మణ ఆలయం కూడా ఉండటంతో సీతారామాంజనేయ దైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. వరంగల్ మహానగరానికి 8కి.మీల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయాన్ని ధర్మపురి మఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి, హనుమాన్ ఉపాసకురాలు జయశ్రీమాత, సుందర చైతన్యానందస్వామి తదితర ప్రముఖ పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు సందర్శించారు. ప్రతీ సంవత్సరం హనుమాన్ దీక్షల కోసం వేలాది మంది భక్తులు తరలివచ్చి మాలధారణలు ధరించి మళ్లీ ఇక్కడే మాల విరమణలు చేస్తారు. దీంతో ఆలయం హనుమాన్ భక్తులతో కిక్కిరిసి పోతుంది. ఇదే క్రమంలో ఈ ఏడాది కూడా హనుమాన్‌దీక్షలు ప్రారంభయ్యాయి. ఈ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేయటం వల్ల నవగ్రహ దోషాలు దూరమవుతాయని, ఆకాంక్షలు నెరవేరుతాయని, హనుమాన్ దీక్షలు చేపట్టే భక్తులకు శని దోషాలు తొలగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి అయ్యప్ప శర్మ తెలిపారు. ప్రతీ శనివారం ఆంజనేయ స్వామిని దర్శించుకొని, సుందరకాండమును పఠిస్తే ఇంకా మంచిందంటున్నారు. ఇక ఆలయ కమిటీ ఛైర్మన్ సీతా ఆనంద్‌సా మాట్లాడుతూ హనుమాన్ మాలధారులు, స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న భక్తులకు వారి గోత్రనామాలతో అర్చనలు చేయిస్తామన్నారు.



సీతారామలక్ష్మణులు

హనుమాన్ దీక్షలు ప్రారంభం

ఇప్పటికే హనుమాన్ దీక్షలు ప్రారంభమయ్యాయని ఆనంద్‌సా సోదరులు తెలిపారు. ఈ నెల 12 వరకు 41 రోజులు మండల దీక్షలు, 28 నుంచి మే 2 వరకు 21 రోజుల అర్ధమండల దీక్షలు, మే 8 నుంచి 12 వరకు 11 రోజుల దీక్షలు వేసుకోవచ్చని వారు తెలిపారు. మే 17న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మౌనవ్రతం చేపట్టవచ్చన్నారు.

'ప్రాణదాత' సంతోష్

- 15 ఏళ్లలో 25 సార్లు రక్తదానం
- ఆదర్శంగా నిలుస్తున్న మానుకోట యువకుడు

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని అంటారు. ఈ క్రమంలో చాలామంది రక్తదానం చేయడానికి ముందుకొస్తుంటారు. కొందరు ఏడాదికోసారి మాత్రమే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతారు. ఇక ఇంకా భయపడే వారూ ఉన్నారు. కానీ మహబూబాబాద్ పట్టణానికి చెందిన అయిలి సంతోష్ మాత్రం రక్తం అసరమైన రోగి అంటే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోయి రక్తం ఇస్తాడు. ఇలా సంతోష్ ఆరు నెలలకోసారి రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు 15 సంవత్సరాల్లో 25సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు. మరో విషయం ఏంటంటే సంతోష్ బ్లడ్ గ్రూప్-ఏబీ నెగిటివ్. ఇది సాధారణంగా దొరికే గ్రూప్ కాదు. ఆ బ్లడ్ గ్రూప్ వారు తక్కువగా ఉంటారు. ఆ గ్రూప్ రక్తం అవసరమైన వరు సకాలంలో ఆ గ్రూప్ రక్తం దొరక్క ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలోనే 2009లో సంతోష్ వరంగల్‌లో బీటెక్ చదువుతున్న సమయంలో ఎంజీఎంలో ఓ నిండు గర్భిణికి డెలివరీ సమయంలో ఏబీ నెగిటివ్ గ్రూప్ రక్తం అవసరం పడింది. కానీ బ్లడ్ బ్యాంకుల్లో కూడా నిల్వలేకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఓ స్నేహితుడి ద్వారా సమాచారం తెలుసుకున్న సంతోష్ వెంటనే ఎంజీఎంకు వెళ్లి రక్తదానం చేశాడు. అది అతడు తొలిసారి రక్తదానం చేసిన ఘటన. ఆ తర్వాత సికింద్రాబాద్‌లో ఓ చిన్నారికి గుండె ఆపరేషన్ సమయంలో ఏబీ నెగిటివ్ గ్రూప్ బ్లడ్ అవసరం కాగా అప్పుడు కూడా రక్తమిచ్చి ఓ చిన్నారికి ప్రాణదాతగా నిలిచాడు. ఇలా ఏబీ నెగిటివ్ రక్తం కోసం ఎంతో మంది ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన సంతోష్ అవసరమైనప్పుడే కాకుండా తాను ఆరునెలల కొకసారి రక్తదానం చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అప్పటి నుంచి ప్రతీ ఆరు నెలల కొకసారి బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తదానం చేస్తున్నారు. ఇలా 2009 నుంచి ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేశాడు.



సంతోష్ బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ (ఫైల్)

త్వరలో బ్లడ్ డోనర్ యాప్ ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా బ్లడ్ డోనేషన్ సేవలందించేందుకు త్వరలో బ్లడ్ డోనర్ యాప్ ఏర్పాటుకు సంతోష్ సన్నాహాలు చేస్తున్నాడు. ప్రత్యేకంగా యాప్‌ను క్రియేట్ చేస్తే అందులో రక్తదానం చేసే వారు తమ పేరు, గ్రామం, సెల్ నెంబరు, బ్లడ్ గ్రూప్ తదితర నమోదు చేయొచ్చని, తద్వారా అత్యవసర సమయాల్లో ఏ గ్రూప్ బ్లడ్ అవసరపడితే ఆ బ్లడ్ గ్రూప్ వారికి సమాచారం అందించి రక్తాన్ని సేకరించే అవకాశం ఉంటుందని చెబుతున్నాడు. అలాగే వారి చిరునామా కూడా అందులో నమోదు చేయడంతో సమీప గ్రామాలు, పట్టణాల్లో ఉన్న వారికి ఫోన్ చేస్తే త్వరగా వచ్చి రక్తదానం చేసే అవకాశం ఉంటుందని, దీంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడుకోవచ్చన్నాడు.



రక్తదానం చేస్తున్న సంతోష్ (ఫైల్)

మైనింగ్.. అక్రమాల్లో రింగ్!

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా తరలిస్తు పన్నులు ఎగవే స్తున్నారు. రెవెన్యూ, పోలీసు, మై నింగ్ అధికారుల సహకారంతో విచ్చలవిడిగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల అనుమతి తీసుకున్నదానికంటే అధికంగా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలాల్లో మూడు చోట్ల ఇసుక క్వారీల్లో పరిమితిని దాటి తవ్వకాలు చేస్తున్నట్టు సమాచారం.

మైనింగ్ ఖజానాకు అంతంతే

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వంద శాతం అదాయాన్ని రాబట్టలేకపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 335 మైనింగ్ క్వారీలకు అనుమతులున్నాయి. వీటి నుంచి రూ.190.02కోట్ల అదాయాన్ని రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే మార్చి 31వ తేదీ వరకు కేవలం రూ.142.43కోట్లే వసూలు చేశారు. అంటే సుమారు 75శాతం వరకు వసూలయ్యాయి. మిగతా 25శాతం అదాయాన్ని రాబట్టడంలో మైనింగ్ అధికారులు చేతులెత్తేశారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో మొత్తం 51 క్వారీలు ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.72కోట్ల అదాయం లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం రూ.11.49కోట్లు మాత్రమే వసూలు చేశారు. అంటే కేవలం 50శాతమే లక్ష్యాన్ని చేరుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో 128క్వారీలు ఉండగా, వీటిలో 100క్వారీల్లో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి. మరో 28 క్వారీలు నాన్ వర్కింగ్ పేరుతో పన్నులు చెల్లించడం లేదని సమాచారం. మిగిలిన వాటి నుంచి రూ.61.72కోట్ల అదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం రూ.37.08కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక జనగామ జిల్లాలో 39క్వారీలు ఉండగా, గతేడాది రూ.12.15కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.6.55కోట్లు మాత్రమే వసూలు చేయటం మైనింగ్‌శాఖ అధికారులు పనితీరుకు నిదర్శనంగా చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖ అధికారులు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను చేరుకోవడంతో విఫలమయ్యారనే టాక్ వినబడుతుంది.

అధికారుల కనుసన్నల్లోనే అక్రమార్కుల దందా..

మైనింగ్ శాఖలోని కొందరు అధికారుల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్ సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో చాలా వరకు క్వారీలు వాటికి కేటాయించిన భూమి పరిధిని దాటి అక్రమ మైనింగ్ చేస్తున్నా అధికారులు మౌనంగా సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో చాలా వరకు అనుమతులు లేకుండా క్వారీలను నిర్వహిస్తున్నారు. కొన్ని కంకర క్వారీలు నడుస్తున్నప్పటికి నాన్ వర్కింగ్ బోర్డు పెట్టి పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. రాజకీయ నాయకుల అండతో పాటు అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్ దందాతో కోట్లాది రుపాయల సొమ్మును కొల్లకోడుతున్నారనే ప్రచారం జరుగుతుంది. మహబూబాబాద్‌లో ఓ మైనింగ్ అధికారికే బినామీ పేర్లతో గ్రానైట్ దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి అక్రమ దందా అంతా కొంతమంది అధికారుల కనుసన్నల్లోనే సాగుతుందనే ప్రచారం జరుగుతుంది. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించి, అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- 7 నుంచి 15 వరకు ఫాతిమా హైస్కూల్లో టెన్త్ స్పాట్ క్యాంపు
- కేంద్రానికి చేరుకున్న 2,27,000 జవాబు పత్రాలు
- విధుల్లో పాల్గొననున్న 1,600 మంది టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నెల 7 నుంచి 15 వరకు జరగనున్న టెన్త్ స్పాట్ క్యాంపులో ప్రభుత్వ పరీక్షల అదనపు కమిషనర్, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ బి.భువనేశ్వరి నేతృత్వంలో విద్యాశాఖ సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్లో నిర్వహిస్తున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించనున్న ఉపాధ్యాయులకు అన్ని వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్పాట్ క్యాంపులో ఈ ఏడాది 2,27 000 జవాబు పత్రాలు మూల్యాంకనం కానున్నాయి. స్పాట్ క్యాంపులో వివిధ హోదాల్లో 1600 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. గత నెల 25 నుంచి కోడింగ్ సైతం ప్రారంభమైంది. ఈనెల 6తో కోడింగ్ ముగియనుండగా, 7 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది.

2.27 లక్షల జవాబు పత్రాలు

టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో ఈ ఏడాది 2, 27000 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టుల జవాబు పత్రాలు స్పాట్ క్యాంపునకు చేరుకున్నాయి. కాగా, గత నెల 25 నుంచే జవాబు పత్రాల కోడింగ్ ప్రారంభమైంది. గత నెల 21 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, స్పాట్ కేంద్రానికి జవాబు పత్రాలు రాగా కోడింగ్ ప్రారంభించారు. జవాబు పత్రాల కోడింగ్ ఈ నెల 6తో ముగియనుండటంతో 7 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు నిర్విరామంగా కొనసాగి 15తో ముగియనుంది.

పాల్గొననున్న 1600 మంది ఉపాధ్యాయులు

ఈ ఏడాది నిర్వహిస్తున్న టెన్త్ స్పాట్ క్యాంపులో వివిధ హోదాల్లో 1600 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. 951 మంది ఏఈలు, 164 మంది సీఈలు, 450 మంది స్పెషల్ అసిస్టెంట్లు, ఇద్దరు కోడింగ్ అధికారులు, 8 మంది అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు, 8 మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 14 మంది ఏసీవోల స్పెషల్ అసిస్టెంట్లు, 10 మంది పార్ట్-3లో విధులు నిర్వర్తించనున్నారు. డీఈవో వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండగా, ఏసీజీఈ బి.భువనేశ్వరి అసిసెంట్ క్యాంప్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.



టెన్త్ స్పాట్ నిర్వహించే ఫాతిమా హైస్కూల్

సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం : బి. భువనేశ్వరి, ఏసీజీఈ

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రమైన ఫాతిమా హైస్కూల్లో ఏర్పాట్లకు చర్యలు చేపట్టాం. విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తాగు నీటి వసతి, మూల్యాంకనం చేసే గదుల్లో ఫ్యాన్లు ఇతరత్ర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈనెల 7 నుంచి నిరంతరాయంగా తొమ్మిది రోజుల పాటు జరిగే మూల్యాంకనంలో నిర్ధేశిత సమయంలో మూల్యాంకన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

పరిశ్రమలు స్థాపిస్తే లక్షలాది ఉద్యోగాలు

- నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- పరకాలలో జాబ్‌మేళా సందడి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

పరకాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు స్థాపిస్తూ వాటికి కావాల్సిన పెట్టుబడులు పెడితే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో వెళ్తుంటే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాలులో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. వివిధ కంపెనీల్లో నియమితులైన కొంతమంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజల కు మేలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యువతను నిర్లక్ష్యం చేసి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించడంలో భాగంగా పరకాలలో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. విద్యార్హతలను బట్టి ప్రతీ ఒక్కరికి ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా పెద్ద పెద్ద కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. చిన్న ఉద్యోగం అనేది కాకుండా ఆరు నెలల నుంచి ఏడాది పాటు ఉద్యోగంలో నైపుణ్యం పెంచుకోగలిగితే రాను రాను మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఉద్యోగానికి పది మంది పోటీ పడుతున్నారని, రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నైపుణ్యం పెంపొందించే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాలు వేసింది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 57వేల ఉద్యోగాలు అందించామని తెలిపారు. రానున్నది డిజిటల్ యుగమని యువత కాలంతోపాటు పరుగులు తీయాలని సూచించారు. కాలేజీలకు అంతర్జాతీయ బ్యాంకులను అనుసంధానం చేస్తూ పదివేల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 5 వేల మందికి ఉద్యో గాలు ఇప్పించడం కోసం 53 కంపెనీలను తీసుకువచ్చామని పేర్కొన్నారు. జాబ్‌మేళా ఆర్నెళ్లకోసారి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 26న భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. పరకాలలో ఉద్యోగాలు రాని వారు భూపాలపల్లిలో జరిగే జాబ్‌మేళాలలో పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవో నారాయణ, కమిషనర్ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

అకాల న(క)ష్టం

- ములుగు జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
- వరి, మామిడి రైతులకు అపార నష్టం
- తడిసిన మిర్చి, పొగాకు పంటలు

ములుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నోటికాడి బుక్క నేలపాలైంది.. వారంరోజుల్లో ఇంటికి చేరాల్సిన వడ్లు తడిసిముద్దయ్యాయి.. ఆశలు పెట్టుకున్న మామిడి తోటలు, ఆదుకుంటుందనుకున్న మిర్చి పంట దెబ్బతింది. దీంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. గురువారం సాయంత్రం ములుగు జిల్లాలో అకాల వర్షం కురిసింది. మంగపేట, గోవిందరావుపేట మండలాల్లో వడగండ్లు పడ్డాయి. గోవిందరావుపేట మండలంలోని చంద్రుతండా, అమృతండా, కర్లపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో కోతకు వచ్చిన సుమారు 400ఎకరాల వరిపంట నేలవాలింది. వడ్లు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. వానకు ఈదురుగాలులు తోడవ్వడంతో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నది. వడగండ్ల ధాటికి మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. ఉరుములు, మెరుపుల భయంతో వణికిపోయిన రైతులు శుక్రవారం తెల్లవారి చేలవద్దకు వెళ్లగా నేలవాలి ధ్వంసమైన పంటలను చూసుకొని వలవలా ఏడ్చారు. రెక్కల కష్టం, వేలాది రూపాయల పెట్టుబడి వర్షార్పణం కావడంతో వేదన చెందారు. శుక్రవారం మధ్యాహ్నం కూడా పస్రా పరిసర ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. మంగపేట మండలంలో వరి, మిర్చి పంట దెబ్బతిన్నది. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు తడిసిపోయాయి. కమలాపురం వద్ద 30ఎకరాలలో పొగాకు పంట తడిసి ముద్దయ్యింది. ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో మిర్చి స్వల్పంగా తడిసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం గోవిందరావుపేట మండలంలో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామన్నారు. జరిగిన నష్టంపై తక్షణమే సర్వే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రులతో మాట్లాడి తక్షణసాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



గోవిందరావుపేట మండలం కర్లపల్లిలో నేలవాలిన వరి



మంగపేటలో తడిసిన పొగాకును చూపుతున్న రైతు

బాధిత రైతులకు పరిహారం అందిస్తాం

- అధికారులు నష్టం అంచనా నివేదికలు అందజేయాలి
- వర్షానికి ధ్వంసమైన పంటల పరిశీలనలో మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన జిల్లాలోని ప్రతీ రైతుకు నష్టపరిహారం అందజేసి అండగా ఉంటామని, ఇందుకోసం సంబంధిత అధికారులు నష్టం అంచనా నివేదికలను అందజేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. శుక్రవారం ఆమె అధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి గోవిందరావు మండలం అమృతండా, లక్ష్మీపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామాల్లో పర్యటించి అకాల వర్షంతో ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆకాల వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటిపాలైందని, వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆమె వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫోన్‌చేసి పంట నష్టాన్ని వివరించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యం చెందొద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మన్ బానోత్ రవిచందర్, టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లాడి రాంరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, మండలపార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

- పరారీలో మరొకరు
- మానుకోట డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం అయోధ్య పరిధిలోని భజనతండా శివారులో ఈనెల 1న అర్ధరాత్రి జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు గాను.. ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని జగదీష్ కాలనీకి చెందిన తాటి పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకుని మార్చి 28న స్వగ్రామమైన భద్రాచలంకు వచ్చాడు. అనంతరం విధుల్లో చేరేందుకు మార్చి 31న సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి బయలుదేరాడు. ఈ విషయాన్ని పార్థసారథి భార్య స్వప్న ఆమె ప్రియుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవోమంగి మండలం జడ్డంగి గ్రామానికి చెందిన సోర్లాం వెంకట విద్యాసాగర్‌కి ఫోన్‌చేసి పార్థసారథి దంతాలపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సంగతి తెలిపింది. భర్త అడ్డు తొలగించుకునేందుకు తాటి స్వప్న తన ప్రియుడు సోర్లాం వెంకటవిద్యాసాగర్ కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన తెలుగూరి వినయ్‌కుమార్, శివశంకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరిసీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రానికి చెందిన వంశీ, జడ్డంగికి చెందిన కుసంలవరాజ్‌లకు రూ.5 లక్షల సుపారి ఇచ్చారు. పార్థసారథి తన ద్విచక్రవాహనంపై అయోధ్య శివారు భజనతండా వద్దకు రాగానే సుపారి తీసుకున్న నలుగురు ఇనుపరాడ్లతో తలపై కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. ఈ కేసులో వినయ్ కుమార్, శివశంకర్, వంశీలను అరెస్టు చేయగా.. లవరాజ్ మాత్రం పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక, మురళీధర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న మానుకోట డీఎస్పీ తిరుపతిరావు

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలో పేద ప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని 28 వార్డు హన్మంతునిగడ్డలో శుక్రవారం సన్నబియ్యంపంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిందన్నారు. ఉచిత సన్నబియ్యం పథకం ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబానికి నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ పేద కుటుంబం ఆకలికి గురికాకుండ పోషకాహారం సమృద్ధిగా అందుకునేలా ఈ పథకం రూపొందించబడిందన్నారు. సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా లబ్ధిదారులకు తక్షణ సాయం అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


హన్మంతునిగడ్డలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

రాజ్యాంగ విలువలను కాపాడాలి

కేసముద్రం/ఇనుగుర్తి, (ఆంధ్రజ్యోతి) : దేశంలో నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని, రాజ్యాంగ విలువల్ని కాపాడాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రం మండల కేంద్రంలో, ఇనుగుర్తి మం డలం కోమటిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జైబాపు, జైభీం, జై సంవిధాన్' కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తోందని, అమిత్‌షా పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందొరెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఇరు మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెళ్లి సతీష్, కొట్టం రాము, రావుల మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలి

- క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిలా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్‌స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలో పదోన్నతి పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ శిక్షణ శిబిరానికి హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీజీహెచ్ఎంలుగా 60 మంది, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా 72 మంది పదోన్నతి పొందారని.. వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల నిర్వహణను చేపట్టాలన్నారు. వివిధ సబ్జెక్టుల్లో 434 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారని ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టుసాధించేలా బోధనచేయాలన్నారు. పాఠ్యాంశాల్లోని అంశాలతోపాటు నిజజీవితంలో ఉపయోగపడే అంశాలను కూడా బోధించాలని సూచించారు. పాఠశాల నిర్వహణకు ఉపయోగపడే అంశాలు, వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, యూనిట్, ఎస్ఏ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం మొదలగు అంశాలపై రిసోర్సు పర్సన్‌లు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నేడు కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయంలో **కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**ఆదేశాల మేరకు శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు పూలమాల వేసి నివాళ్లర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కులసంఘాలు, ఉద్యోగులు, అధికారులు, దళిత, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ నాయకులు హాజరుకావాలన్నారు.

తడిసిన మిర్చిని కొనుగోలు చేయాలని ధర్నా

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి తడిసిన మిర్చి బస్తాలను తక్షణమే కొనుగోళ్లు చేపట్టి, క్వింటాకు రూ.26 వేలు మద్దతు ధర కల్పించాలని బహుజన వాది వివేక్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులతో ఎల్‌హెచ్‌పీఎస్, ప్రజాసంఘాల నాయకులతో మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రోడ్డుపై బైఠాయించి, ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడ్రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లో మిర్చిని కొనుగోలు చేయకుండా కాలయాపన చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యార్డులో షెడ్లు పూర్తిగా లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని, జోరువర్షంలో రైతుల మిర్చి బస్తాలు తడిసి ముద్దవుతున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదే సమయంలో మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ ధర్నాకు వచ్చి ఖరీదులు చేపడుతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం వివేక్ ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి మార్కెట్‌లో ఉన్న పరిస్థితులను వివరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, విష్ణునాయక్, కేలోతు సాయికుమార్, భూక్య శ్రీకాంత్, గుగులోతు సూర్యప్రకాష్, ఎల్ఎస్ఓ అధ్యక్షుడు శివవర్మనాయక్, రైతులు పాల్గొన్నారు.


మహబూబాబాద్-ఇల్లందు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు


డీపీవో హరిప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

వేతనాలను విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రావాల్సిన 6 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీపీవో హరిప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఆరునెలల పెండింగ్ వేతనాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీనెల 1వ తేదీన వేతనాలు ఇచ్చేవిధంగా చూడాలన్నారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎల్లయ్య, చారి, చాంద్ పాషా, రాంకోటి, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ఎలుకల మందుతాగిన బాలిక మృతి

ఇనుగుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ శివారు మంగలితండాకు చెందిన బాలిక (17) కూల్‌డ్రింక్‌లో ఎలకలమందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అనారోగ్య కారణాలతో సదరు బాలిక గతనెల 30న ఇంట్లోనే క్రిమిసంహారక తాగింది. మరుసటి రోజు వాంతులు చేసుకుంటుండడంతో కుటుంబ సభ్యులు బాలికను ప్రశ్నించగా తాను కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగినట్లు చెప్పింది. దీంతో బాలికను తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి అక్కన్నుంచి ఖమ్మంలోని ప్రైవేటు దవాఖానకు తరలించగాచికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

బీఆర్ఎస్ సభను సక్సెస్ చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఈదురు ఐలయ్య

పెద్దవంగర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న ఎల్కతుర్తి మండలకేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రామదండులా కదలిరావాలని బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీరాం సంజయ్, కనుకుంట్ల వెంకన్న, రాము, హేమని, రాజేందర్, రఘు వెంట్రామయ్య, వెంకన్న, వెంకటొరెడ్డి, గంగాధర్, వీరన్న, షర్ఫోద్దీన్, రాంమూర్తి, ఉషాలు, రమేష్, చంద్రబోస్, సతీష్, యాకయ్య, సోమన్న, ధనంజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

కురవి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ.. మైనార్టీలపై దాడులకు పాల్పడుతుందని కాంగ్రెస్ కురవి మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నేరడ, చంద్యతండ, ఎలకచెట్టుతండా, బాల్యతండా, చీమ్లాతండాల్లో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో వీరభద్రం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, గొల్లపల్లి రజినీకాంత్, గార్లపాటి వెంకట్‌రెడ్డి, కొర్నిరవీందర్‌రెడ్డి, అనిల్, దయ్యాల శ్రీధర్, మడూరి రఘు, ఇరుగు శ్రీను, నరేడ్ల వెంకట్‌రెడ్డి, నజీర్, కొలిపాక రాములు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా బీజేపీ పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా విస్తృతస్థాయిసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 1980 ఏప్రిల్ 6వ తేదీన ఆవిర్భవించిందని చెప్పారు. దేశంలో 2 ఎంపీ స్థానాలు గెలిచిన బీజేపీ పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతూ.. 20 రాష్ట్రాల్లో అధికారం చేపట్టి కేంద్రంలో మూడోసారి ప్రధాని మోదీ అధికారం చేపట్టారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకుల కృషి వల్లనే పార్టీ ఈ స్థాయిలో ఉందని చెప్పారు. కుటుంబ అవినీతి రహిత పాలన అందించడమే బీజేపీ పార్టీ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితవాగ్దానాలతో అధికారంలోకి వచ్చి 15 నెలల కాలంలోనే ఒక్క హామీని కూడ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత పార్టీనాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను ఎందుకు అమ్ముతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఈనెల 6న ప్రతీ కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, నాయకులు చీకటి మహేష్ గౌడ్, సింగారపు సతీష్, పొదిళ్ల నర్సింహారెడ్డి, గడ్డం అశోక్, సత్యనారాయణ, సంగీత, మోసంగి మురళి, సిరికొండ సంపత్, జహేందర్‌నాయక్, ఓర్సు పద్మావతి, రాధాపటేల్, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్ పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న కేంద్రం

గార్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మధ్య భారతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తుకు ధారాదత్తం చేయడం కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కాగర్ ఉపయోగిస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కార్యకర్తల సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. జల్, జంగిల్, జమీన్ కోసం పోరాడుతున్న ఆడవిబిడ్డలను పోలీసులు భయభ్రాంతులు చేయడం సరైంది కాదన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ సీతరాములు, బానోత్ బిచ్చా, జగన్, రామవీరు, రాధమ్మ, భారతి, అనసూర్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు ఆవిష్కరించారు. అనంతరం కళాశాల యాంటి డ్రగ్స్ కోఆర్డినేటర్ లెంకల గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వాడకంపై జరిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్.మైసయ్య, గడిచెల రాజు, అలువాల యాదగిరి, ఎండీ.మున్ని, ఉడుత రవి, సోమ ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గార్ల, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు యాకుబ్‌మీయా కుటుంబానికి పలు రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. దాతల నుంచి సేకరించిన సుమారు యాభై ఏడువేల ఐదు వందల రూపాయల నగదును యాకుబ్‌మీయా భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, దనియాకుల రమారావు, లక్ష్మణ్‌నాయక్, యాకుబ్ పాష, కట్టా రమేష్, అలవాల సత్యవతి, జంపాల వెంకన్న మురళి, రహీం, ఆర్ఆర్, ఉపేందర్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

కురవి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని కురవ ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. కురవి మండలం నేరడ జడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీవిరమణ పొందిన వలబోజు సుధాకర్‌ను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఆ ప్రాంత విద్యార్థులు ఎప్పటికి గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కుదురుపాక కనకమ్మ, షేక్.జానీ, వెంకట్రాంనర్సయ్య, ఉపాధ్యాయులు మాంజీ, సాయిలు, కిష్టు, కరుణ, ప్రేమ్ కుమార్, ప్రకాశం, అజ్మతుల్లాఖాన్ పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయండి



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీరేందర్

కురవి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మంలో ఈనెల 25, 26, 27 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కొలిపాక వీరేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కురవిలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగ, విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల గణేష్, మహేష్, వినోద్, ప్రవీణ్, వీరన్న పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వానికి క్షీరాభిషేకం చేస్తున్న 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు

'ప్రజాప్రభుత్వానికి రుణపడి ఉంటాం'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని 2008 డీఎస్సీకి ఎంపికైన ఇటీవల కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియామకమైన ఉద్యోగులు భాస్కర్, రాజేందర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008 నోటిఫికేషన్ ద్వారా ఎంపికై నష్టపోయినఅభ్యర్థులకు గత 15ఏళ్లగా హైకోర్టు, సుప్రీంకోర్టుల నుంచి ఎన్నో ఫైనల్‌తీర్పు వచ్చినప్పటికీ ఏ ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌అధికారంలోకి రాగానే హైకోర్టు ఇచ్చిన ఇంటిరియం అర్డర్‌ను గౌరవించి ఫిబ్రవరి 15న కాంట్రాక్ట్ పద్ధతిలో నియామక పత్రాలు ఇచ్చి జీవితంలో వెలుగు నింపారన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రవీందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీలత, స్వప్న, నరేష్, వెంకటేశ్వర్లు, పద్మ, జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాచలం తలంబ్రాలు


కేసముద్రంలో భద్రాచలం కల్యాణ తలంబ్రాల సేవపోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామస్థులు

కేసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఈనెల 6న నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు ఆర్టీసీ కార్గో ద్వారా మీ ఇంటి వద్దకే వస్తాయని మాజీ ప్రజాప్రతినిధి జాటోత్ హరీష్‌నాయక్ తెలిపారు. కేసముద్రంలో తలంబ్రాలు పొందే సేవకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం తలంబ్రాలు పొందేందుకు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 9154298768 నెంబరులో సంప్రదించాలని కోరారు. వోలం వీరభద్రరావు, భూక్య నరేష్, ఎం.వెంకటేశ్వర్లు, అంగోత్ శివలాల్, ధరావత్ అర్జున్, ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సింగారపు వేలాద్రి పాల్గొన్నారు.

అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులపై వర్షం పడింది. టార్పాలిన్‌లు కప్పుకోవడంతో నష్టం వాటిల్లలేదు. వర్షపునీటిని కవర్లపై నుంచి తొలగించి ఆరబెట్టుకున్నారు. గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తిలలో చిరుజల్లులు కురిశాయి. మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

రోగులకు నమ్మకం కలిగేలా పనిచేయాలి: మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు చికిత్స కోసం వచ్చే రోగులకు నమ్మకం కలిగేలా వైద్యాధికారులు పనిచేయాలని, వారిని ఆప్యాయంగా పలకరిస్తూ మెరుగైన వైద్యసేవలందించాలని, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. శుక్రవారం ములుగులోని ఏరియా ఆస్పత్రి సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో, జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఆస్పత్రి సూరింటెండెంట్, వైద్యనిపుణులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ముందుగా ఆమె జిల్లాలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై వీహెచ్‌సీలవారీగా సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలే మనకు దేవుళ్లుగా భావించి మానవీయకోణంలో జనంతో మమేకమై మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. జిల్లాలోని ములుగు, ఏటూరు నాగారంలలో ప్రధాన ఆస్పత్రులు ఉన్నాయని, వాటితోపాటు ఇతర ఆస్పత్రుల్లో యువ వైద్యులు ఉన్నారని, మానవతా దృక్పథంతో ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. వైద్యసిబ్బంది 24గంటల పాటు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి మండలకేంద్రంలో 108వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సొంత భవనం నిర్మించడంతోపాటు విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి అవసరమైన సదుపాయాలు మెరుగుపరుస్తామని మంత్రి తెలిపారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలకు తగిన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. అనంతరం మంత్రి సీతక్క ఆస్పత్రిలోని పలువార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు చంద్రకాంత్, పవన్‌కుమార్, రణధీర్, వైద్యనిపుణులు కిషోర్, ప్రేమ్‌సింగ్, గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్స్ జనరల్ మెడిసిన్, ఛాతి వైద్యనిపుణులు, కంటి వైద్యనిపుణులు పాల్గొన్నారు.